# ఒక వాన రోజున మా ఇంట్లో

నందగిరి ఇందిరాదేవి.

నిజానికి ఏదో అక్కయ్యగారు అతి ఆప్యాయంగా అడుగుతున్నారు కనుక కాని లేకపోతే మా యిల్లు కురుస్తుందని కాని, మా వారికి కోపం ఎక్కువ అని గాని ఎవరితోనూ చెప్పుకోవాల్సిన విషయాలు కావు అవి బట్టకింది తొడపాశం లాగా అనుభవించాల్సిందే రోజూ జరుగుతున్న ఆ విషయాలు చెప్పినా ఎట్లా ఉంటుందంటే ఒకసారి ఒక గారాబాల అబ్బాయి రైలు ప్రయాణం చేస్తున్నాడట తండ్రి పాపం ఆదుర్దాగా రైలెక్కినప్పటి నుండి వివరాలన్నీ వ్రాయమన్నాడట ఇహ అబ్బాయి ఉత్తరం రాస్తూ "వంతెన వచ్చింది రైలు గడా గడా గడా గడా గడా" అని మొదలు పెట్టాడు ఆ గడా గడా ఎన్ని పేజీలు వ్రాసినా మైలు పొడుగు వంతెన ఎంతకీ దాటటంలేదు రైలు అట్లాగా నాలుగు నెల్లు వానకాలం మా యిల్లు కురిసీ కురిసి కురిసి అని మొదలు పెట్టితే ఆ అబ్బాయి ఉత్తరంలాగా వుంటుంది

అసలు వానే బేజారుగా ఉంటుంది ఆ సంగతి తల్చుకుంటేనే చికాకు నిజంగా చిన్నప్పుడు వానలో తడుసుకుంటూ నీళ్ళలో కాగితంపడవలు వొదులుకుంటూ, 'వానాలు కురియాలి వరిచేలు పండాలి మా నాన్న తేవాలి—మా అమ్మ వండాలి' అని పాడుతుంటే బలే కుషీగా ఉండేది. ఈ సాధక బాధకాలు అప్పుడేం తెలిసేవి గావుగా'

వానాలు కురవటం వరిచేలు పండటం మాట ఎట్లావున్నా వానాలు కురవటం మా యిల్లు కురవటం మాత్రం నిజం మరిట ఒకసారి ఇద్దరు సర్దారులు ఒక ఉదయంపూట సూర్యభగవానుని చూచి, ఒకరు చంద్రుడని, కాదు సూర్యుడని తగాదా పడ్డారట. ఆ తగాదా కొట్టుకోటం వరకు వచ్చేసరికి మూడోవాణ్ణి అడిగి తేల్చుకుందాం అని దారిబడిపోతున్న మరొక్క సర్దారుని అడిగారట సూర్యుడా చంద్రుడా అని ఆయనన్నాడట "ఏమో బాబూ నేనీ వూరికి కొత్తగా వచ్చాను.

నాకూ తెలియదు'' అన్నాడు. ఎందుకు చెప్పానంటే అటువంటి అనుమానం ఏ కోశాన లేకుండా రవి సుధాకరు లున్నన్ని రోజులు మా యిల్లు ఉరవట మనే నగ్నసత్యాన్ని మీ రెవ్వరూ గుర్తించక పోవచ్చు ఇంకో విషయం ఏమిటంటే మా ఇల్లు గలాయిన చెప్పి నట్టు, "ఇల్లు బాగుచేయించండి బాబూ" అని కడుపులు కాళ్ళు పట్టుకు బతిమాలు కుంటే ఆయన "అమ్మాయ్! మీ యిల్లు ఒకటేకాదు ఈ వాడలో ఇళ్ళు అన్నీ ఇట్లాగే ఉన్నాయి ఈ వాడలోనే కాదు ఈ దేశంలో ఇళ్ళతీరే అంత"అంటాడు అట్లా వాడలకు వాడలు దేశాలకు దేశాలే నీళ్ళు కారిపోతుంటే మా ఒక్క యిల్లు కురిసిందని చెపితేమాత్రం ఎవరి కేం లెక్క చెప్పండి!

ఇప్పుడింత తాపీగా చెపుతున్నా కాని వాన పడేవరకుమాత్రం నాకు నిజంగా వెర్రెత్తి పోతుంది వెర్రెత్తిస్తారు ఇంటిల్లిపాది పాలవాడు గేదెను తీసుకు రాడుగదా, సగంనీళ్ళు సగంపాలు కలిపి చేతిపాలు పోయటంతో ఆరంభం ఘర్షణ ఇట్లా నీళ్ళుపోస్తే ఎట్లా అని అరచి కోప్పడితే "బర్రె, నీళ్ళు శానాతాగింది. నేను నీల్లసుక్క కలిపితే ఒట్టు" అంటాడు చమత్కారంగా

పొద్దున్నే అసలే హడావిడి–అందులో వాన.చకచకా తెమిలిపనిచేసుకోకుండావాన పడేవరకు ప్రైవేటు టీచరు దగ్గరనుండి పనిమనిషివరకు అంతా నాగాలే వేస్తారు వానవస్తుందేమో అనుకొని ప్రైవేటు టీచరు రాకపోతే, సాక్షాత్తు పడుతుంటే పనిమనిషి ఎట్లా వస్తుంది చెప్పండి ఇంట్లోనేఉన్న పనికుర్రాడు కూడా ఆ రోజు గరాజులోంచి బయటికిరాడు ఏమిటిరా అంటే గజగజ వణుక్కుంటూ "నాకూ జరం" అంటాడు ఇద్దరి పని నెత్తిన పడుతుందన్న భయంతో వాళ్ళంటే తప్పించుకోగలరుకాని మన కెట్లా తప్పుతుంది? పిల్లలంతా లేచి గోల–ఒకరికి కాఫీ ఒకరికి వేడినీళ్ళు– వాన అని అరగంట ఆలస్యంగా లేచే వరకు అంతా upset–అయిపోతుంది గబగబా వంటిల్లు శుభ్రంచేసుకుని ఆరాత్రి అంట్లన్నీ పక్కకునెట్టి పొయ్యి అంటిద్దామంటే అదీ స్ట్రైకు కట్టెలు మండవు బొగ్గులు అంటుకోవు. మొదటే చెప్పాగా తడవని భాగంఅంటూ లేదని ఒకసారి అయితే ఇల్లువొదిలి పారిపో వాల్సి వచ్చింది బయట వాన వెలిసినా ఇంట్లో వెలవదాయె వాన! ముసుర్లు తగ్గాక వచ్చి చూస్తే లా పుస్తకాలు, కామెంటరీలు, డైజెస్టులు అన్నీ నీళ్ళలో ఈతకొడుతున్నాయి రెండుమూడు వేల రూపాయిల లైబ్రరీ అంతా పాడయి పోయింది ఆ యేడు మళ్ళీ ఆ అద్దాయి ఉత్తరం లాగానే కురవటం సంగతే దొర్లింది.



"స్పెషల్ కాఫీకి మామూలుకాఫీకీ తేడా ఏమిటి?"

"రెండణాలు."

ఈ వాన – ఉరుపు – పనిమనిషి రాకపోవటం, కట్టెలు మండకపోవటం ఈ అవస్థంతాపడి తనకూ పిల్లలకూ ఓ కూర, అన్నం అయినా చేద్దామని తొందరపడుతుంటే మా దొరగారు ఎనిమిదింటికి లేచి, బొంగరంలాగా తిరుగుతున్నానని, నా నోటికి విరామం లేదని, నా గోలకి తనకు నిద్రేపట్ట లేదని రిమార్కులు. పోనీ అంటేఅన్నారు, నాపని సక్రమంగా చేసుకోనిస్తారా అంటే అదీలేదు తేపతేపకు పిలవటం–సిగరెట్టుపెట్టి అందించడంకోసం అగ్గిపెట్టికోసం–మంచంకింద ఉన్న స్లిప్పర్లే కనబడవు వారికి ఒక్కొక్కసారి ఇహ బాత్‌రూంలో ముఖం కడుగుకుంటూ కూడా పనులు పురమాయిస్తారు. ఇంట్లో కూడా ఎన్నో Personal files ఓ క్లర్కుకు ఉన్నంత పని ఉంటుంది. చెప్పినపనులు మర్చిపోయ్యానన కుండా కాగితం పెన్సిలు తెచ్చుకుని నోటు చేసుకోమంటారు నంబరు 1 ఫలానా యిన్సూరెన్సు కంపెనీకి పాలిసీ రెఫరెన్సు ఇస్తూ రసీదు పంపలేదు అని ఒక లెటరు అర్జంటు ఇవ్వాళ డిస్పాచ్ కావాలి నంబరు 2 కారు స్టార్టింగులో

ట్రబులిస్తున్నది. కార్ఖానాకు తీసుకెళ్ళాలి. నంబరు 3. బ్యాంకుకువెళ్ళి మానేజరును కలిసిరావాలి—ఎందుకంటే ... ఒకటి... అని ఇంకా చెపుతుంటే "వంటింట్లోంచి మాడువాసన వస్తోంది ఇప్పుడే వస్తా"నని పరుగెత్తి చూ ద్దు ను గ దా పొయ్యిమీది అన్నం నానబాలయి కూచుంది కుంపటి మీది కూర మాడి మసిబొగ్గు అయింది. ఆ కూరదించి ఈ అన్నంకింద మంట బెడుతుంటే చంటివాడు కాంపోజిషను దిద్దమంటాడు అబ్బ నిజంగా అష్టావ ధాన మనుకొండి.

పదేవాన పడుతూనే ఉంది ఇంకా పాచియిళ్ళు ఊడ్చుకోలేదు చాకలివాడు తయారు బట్టలెయ్యమని నాయనా నీకూ ఇప్పుడే తీరిందా అనుకొని వచ్చినవాడివి వచ్చావు కాని కాస్త ఇళ్ళు ఊడవమన్నా ఇంతలో పిల్లలంతా బూట్లు బట్టలు వేసుకున్ని తయారయ్యారు పోనీ ఈ పూట వెళ్ళకపోతే ఏమర్రా అంటే ఒకడు టెస్టు ఉందంటాడు ఇంకోడు రిపోర్టు ఇస్తారంటాడు ఇహ అమ్మా యయితే సరేసరి పిడుగుపడ్డా వెళ్ళా ల్సిందే N C C కాబట్టి ఇహలాభం లేదనుకొని ఆ ఉడుకు మిడుకు అన్నంలో ఇంత ఆవకాయ కందిపొడి కలిపి నలుగు రికీ నాలుగు ముద్దలుపెట్టి పంపించేవరకు ఒక ఘట్టం ముగిసింది మా యింట్లో ఆ వానరోజున

కాస్త ఊపిరి తీసుకొనేవరకల్లా గేటుముందర టాంగా ఆగింది మా దూరపు బంధువూ ఆమెకూతురు దిగారు కూతురును అత్తవారింటికిపొంబా యికి పంపిస్తూ దారిలో దిగారన్నమాట ఇక్కడ కూతురుపసిపిల్లతల్లి ఆవిడకు తగని ఆచారం మడి వాళ్ళను చూడ గానే గుండె ఆగినంత పని అయింది కుశలప్రశ్నలు కాగానే రైల్లో తడిసిన పసిపాపబట్టలన్నీ పిండి ఇంటినిండా పద్దాల్లాగా కట్టారు తల్లీ కూతుళ్లు

'దోసెడు కొంపలో పగుల ద్రొక్కిడి మంచము, దూడరేణువున్—బాసినపంట కాలు - పసిబాలుర శౌచము - మాసిన గుడ్డలు' అని శ్రీనాధుడు వ్రాసిన పద్యం జ్ఞాపకం వచ్చి బోరున జడివాన కురియ లేదు కాబోలు ననుకున్నాను

మరి ఇహ వారుచెప్పిన పనులన్నీ నేను చేశానా?

వచ్చినవాళ్ళకు భోజన సదుపాయాలు అమర్చానా?

అన్నింటికంటె ముఖ్యం మావారి కారు స్టార్టయిందా చక్కగా? ఈ ప్రశ్నలకు జవాబులు వెండితెరమీద చూడక్కర్లేకుండా ఎట్లాగో అవస్థపడి అన్నీ లక్షణంగా అమర్చానని నేను చెపుతూ ఈ వాక్చిత్రాన్ని ఇంతటితో ముగిస్తే మీకూ నాకూకూడా తెరిపి

సెలవు